పార్కుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి -నెల్లూరు : నగర పరిధిలోని 44వ డివిజన్ నందు గల మహబూబ్ ఖాన్ పార్క్, 4వ డివిజన్ శ్రీ రామ్ నగర్ పార్క్, సంతపేట గుంట బడిలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాట్లకు, డిప్యూటీ మేయర్ రూపుకుమార్ యాదవ్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్లపాక అనురాధ, నగర అధ్యక్షుడు మామిడాల మధు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేమిరెడ్డీ విజయ భాస్కర్ రెడ్డి, పిట్టి సత్య నాగేశ్వర రావు, కప్పిర శ్రీనివాసులు, కప్పిర రేవతి, రంగన్న ముఖ్య నాయకులు, నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ నందన్, పలువురు ఉన్నతా ధికారులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు 2014లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు.

ప్రజలతో సిపిఎం మాట..మంచి..!

ప్రజా సమస్యలపై పోరుకు సమాయత్తం

.ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

. సిపిఎం రాష్ట్ర మహసభలో ఇటీవల అత్యంత వైభవంగా నెల్లూరు నగరంలో నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రజల వద్దకు వెళ్లడంతోపాటు,యువతను పార్టీలోకి ఆహ్వానించాలనే ఆపార్టీ పిలుపు మేరకు నెల్లూరు నగరంలో ఆపార్టీ నాయకులు ప్రజల వద్దకు వెళుతున్నారు. ఇప్పటకే అనేక ప్రజా సమస్యలపై నిరతరం పోరాటం సాగిస్తోన్న ఆపార్టీ " ని వి ఎ ం మాట. .మంచి" కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈనెల 16 నుంచి నగరంలోని 17,18,9 డివిజన్లలోని పలు కాలనీల్లో ప్రజలతో కలిసి మాట,మంచి పంచుకుంటున్నారు. 17వ డివిజన్‌లోని వెమాలశెట్టి సంగం, శ్రామికనగర్, గుళ్లపాళెం, తదితర ప్రాంతాల్లోనూ, 18,19 డివిజన్‌లోని రాజీవ్ గాంధీకాలనీ, సర్వేపల్లి కట్ట, ప్రాంతాల్లో ఆపార్టీ నాయకులు ప్రజలను కలుస్తున్నారు. వారితో కూర్చొని స్థానిక సమస్యలను చర్చిస్తున్నారు. కమ్యూనిస్టులు అవరం ఏమిటి, ఏం కోరుకుంటున్నారు.. కమ్యూనిస్టులు ఏం చేశారు.. ఏం చెబుతున్నారు... అనే అంశాలను ప్రజలతో చర్చకు పెడుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోనూ,నెల్లూరు నగరంలో, స్థానికంగా సిపిఎం నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇటీవల జరిగిన ఆపార్టీ మహసభల నిర్ణయం ప్రకారం యువతకు రాజకీయాలు ఎందుకు అవసరం, వారి బాధ్యత గురించి చర్చకు పెడుతున్నారు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొనాలని, ఆయా శాఖల ఆధ్వర్యంలో ప్రజలను సమాయత్తం చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుస్తున్నారు. అన్ని విషయాలు వారితో మాట్లాడుతున్నారు. ప్రజలు స్థానికంగా ఉన్న వీధి లైట్లు, మంచి నీరు, రోడ్లు, ఇంటి స్థలాలు, సమస్యలను తీసుకొస్తున్నారు. అన్ని సమస్యలు ఇంటున్న నాయకులు సచివాలయాల వద్ద ఒక రోజు నిరవదిక దీక్షలు చేపట్టడానికి సిద్ధమౌతున్నారు. ప్రజలతో కలిసి వారి సమస్యలు తెలుసుకోవడంతోపాటు, యువతను చైతన్యం చేయడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నామని సిపిఎం నాయకుల కె. సతీష్ తెలిపారు. రోజు వారి సాగుతోన్న సిపిఎం మాట- మంచి కార్యక్రమంలో 17వి శాఖ కార్యదర్శి నజీర్, మహిళా సంఘం నాయకులు పి. మహలక్ష్మీ, నాయకులు ఎస్కె చాన్‌బాషా, మోహయ్య, తోపాటు స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. జిల్లా వ్యాపితంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడానికి ఆపార్టీ సిద్ధమవుతోంది.

సిపిఎం మాట- మంచి కార్యక్రమంలో ఇంటింటికి వెళ్తోన్న సిపిఎం నాయకులు

ప్రశాంతంగా గ్రూప్ -2 మెయిన్స్ పరీక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల సమన్వయ అధికారి టి శ్రీ పూజ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం నిర్వహించిన పరీక్షలకు 4102 మంది అభ్యర్ధులకు గాను 3548 అభ్యర్థులు హాజరు కాగా 554 మంది అభ్యర్థులు గైర్హాజరు కాగా, 86.5 శాతం హాజరు నమోదైనట్లు ఆమె తెలిపారు. గీతాంజలి ఇన్స్టిట్యూట్‌లో ఈ పరీక్షలకు వెయ్యి మంది అభ్యర్థులకు గాను 896 మంది హాజరయ్యారన్నారు. నగరంలోని విఆర్ పిజి కళాశాలలో 840 మందికి 736 మంది హాజరయ్యారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో 600 విద్యార్థులకు గానూ 529 మంది, క్యాబా ఇంజనీరింగ్ కళాశాలలో 480 మందికి గాను 424 మంది నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో 480 మందికి గాను 409 మంది హాజరయ్యారు. నారాయణ ఇంగ్లీషుమీడియం స్కూల్లో 312 మందికి గాను 248 మంది, జగన్స్ డిగ్రీ కళాశాలలో 390 మందికి గానూ 306 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 4102 మంది అభ్యర్థులకు గాను 3546 అభ్యర్థులు హాజరు కాగా 556 మంది అభ్యర్థులు గైర్హాజరు కాగా, 86.4 శాతం హాజరు నమోదు అయినట్లు ఆమె తెలిపారు. గీతాంజలి ఇన్స్టిట్యుట్‌లో 899 మంది, విఆర్ పిజి కళాశాలలో 735 మంది, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 529 మంది, క్యాబా ఇంజనీరింగ్ కళాశాలలో 424, నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో 408 మంది, నారాయణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో 246 మంది, జగన్స్ డిగ్రీ కళాశాలలో305 మంది హాజరైనట్లు తెలిపారు.

పటిష్ట బందోబస్త్

సిఎం నారాచంద్రబాబు నాయుడు నగరానికి విచ్చేసి సందర్భాన్ని పురస్కరించుకోని పటిష్టమైన పోలీసు బందోబస్త్ నడుమ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. హెలి పాడ్ ప్రాంతం నుంచి కన్వెన్షన్ సెంటర్ వరకు ప్రజలకు ఎటు వంటి ఇబ్బం దులు లేకుండా ప్రశాంత వాతా వరణంలో పోలీసు సిబ్బంది బందోబస్త్ నిర్వహణ పూర్తి చేయడంతో ఎస్‌పి జి.కృష్ణకాంత్ పోలీసు అధికారులను, హెూంగార్డు సిబ్బందిని పేరుపేరునా అభినందించారు.

'బీద' ఇంట వివాహానికి సిఎం చంద్రబాబు హాజరు

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రదాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుని వివాహనికి ముఖ్యమంత్రి ఎన్, చంద్రబాబునాయుడు హాజరయ్యారు. ఆదివారం మధ్యాహ్నం గొలగమూడి రోడ్డలోని విపిఆర్ కన్వేక్షన్ సెంటర్‌లో బీద రవిచంద్ర, జ్యోతి కుమారుడు బీద గోకుల్ రిషింత్ ముంబాయికు చెందిన దివ్య తో అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 1.15 నిమిషాలకు కనుపర్తిపాడులో పాఠశాలలో హెలికాప్టర్‌లో వచ్చారు. ఆయనకు మంత్రి పి.నారాయణ, ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితోపాటలు అధికారులు, ఎంఎల్ఎలు స్వాగతం కలికారు. అక్కడ నుంచి కారులో విపిఆర్‌కు వెళ్లారు. అక్కడ బీద రవిచంద్ర , ఎంపి బీద మస్తాన్‌రావు పుష్పగుచ్ఛామిచ్చి స్వాగతం కలిపారు. వేదిక వద్ద గుజరాత్ నుంచి వచ్చిన వదువు తరుపున బందువులు స్వాగతం పలికారు. బీద రవిచంద్ర అందరినీ పరిచయం చేశారు. అందరినీ సిఎం ఆప్యాయంగా పలకరించారు. అనంతరం వదువు, వరువుడులకు పుష్పగుచ్చ మిచ్చి ఆశ్వీర్వాదించారు.అనంతరం ప్రజలకు అభివాదం చేసి, అక్కడ నుంచి హెలిప్యాడ్ వద్దకు వచ్చి అక్కడ నుంచి విజయవాడ పయనమెయ్యారు. సిఎం పర్యటన సందర్భముంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివాహం కావడంతో వెయ్యి మంది పోలీసులను ఉపయోగించి అడుగడుగునా నిఘా పెట్టారు. జిల్లా నలుమూలలతోపాటు, రాష్ట్ర వ్యాపితంగా మంత్రులు, ఎంఎల్ఎలు, టిడిపి నేతలు పెద్ద ఎత్తున హజరైయ్యారు. రాష్ట్ర మంత్రులు డిసి జనార్దన్, బాల వీరాంజనేయస్వామి, కొల్లు రవింద్ర, పి, నారాయణ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎంఎల్ఎలు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, పాశం సునీల్‌కుమార్, విజయశ్రీ, ఇంటూరు నాగేశ్వరరావు, కలెక్టర్ ఒ. అనంద్, ఎస్‌పి కృష్ణాకాంత్, సీనియర్ ఐఎఎస్ అదికారి పి. కృష్ణయ్య, టిడిపి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, నర్సిరెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి. మధు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, టిడిపి జిల్లా అబ్దుల్ అజీజ్, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్దన్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి దామ అంకయ్య ఎంఎల్‌సి మేరిగ మురళి, బిజెపి నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిలోపాటు జిల్లా వ్యాపితంగా పెద్ద ఎత్తున ప్రజలు వివాహనికి హజరైయ్యారు. గొలగమూడి రోడ్డు ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు ట్రాపిక్ పూర్తిగా నిలిచిపోయింది.



వధూవరులను ఆశీర్వదిస్తున్న చంద్రబాబునాయుడు , చిత్రంలో బీద రవిచంద్ర

వధూవరులను ఆశీర్వదిస్తున్న సిఎం

సర్వసభ్య సమావేశం రగడ

ఎంఎల్‌సి, టిడిపి నాయకుల మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి - లింగసముద్రం

మండల సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన సమావేశం మధ్యాహ్నం ప్రారంభమైంది.మండల సర్వసభ్య సమావేశంలో శాసనమండలి సభ్యులు తూమాటి మాధవరావు పాల్గొన్నారు.సమావేశం ప్రారంభం నుంచే అధికార పార్టీ నాయకులకు,వైసిపి ప్రజాప్రతినిధులకు వాగ్వాదం జరిగింది.వైసిపి ప్రభుత్వ లో చేసిన పనులకు వెంటనే బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని తుమాటి మాధవరావు అధికారులకు చెప్పడంతో టిడిపి నాయకులు ఒకసారి సమావేశం హాల్లోకి వచ్చి మాధవరావుతో వాగ్వాదానికి దిగారు.మండలంలో అభివద్ధి పనులకు ఎంపిపి సహకరించకుండా ఆటంకులు సష్టిస్తున్నారని దీంతో నిధులు ఉన్న ఎలాంటి పనులు జరగడంలేదని వారు అన్నారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేసి ఆ తర్వాత జరిగే పనులను అధికార పార్టీ నాయకులు చేసుకోవాలని చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోతే ఎలా అని మాధవరావు ప్రశ్నించారు.దీంతో ఎంఎల్‌సికి టిడిపి నాయకులకు మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది.ఎంపిటిసిలు , జడ్పిటిసి సర్పంచులు అధికారులు సిబ్బందితో జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం హాల్లోకి టిడిపి నాయకులు ఏ విధంగా వస్తారని,వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పనులకు బిల్లులు ఇవ్వకుండా అడ్డుకునేందుకే ఇదంతా జరుగుతుందని ఆయన అన్నారు.సర్వసభ్య సమావేశానికి ఎంఎల్‌సిగా ఉన్న తనను సమావేశానికి రావద్దని టిడిపి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.సమావేశంలో తీవ్ర గందరగోళం చోటు చేసుకోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య ప్రకటించారు. గతంలో జరిగిన సమావేశం కూడా కోరము లేక వాయిదా వేయడం జరిగింది.సమావేశం వాయిదా పడిన అనంతరం ఎమ్మెల్సీ మాధవరావు విలేకరులతో మాట్లాడుతూ లింగసముద్రంలోనే ఈ విధమైన పరిస్థితి ఉందన్నారు.గతంలో చేసిన పనులకి బిల్లులు మంజూరు చేస్తే సర్పంచులు గ్రామాల్లో ఉన్న అధికార పార్టీ నాయకులకి సహకరిస్తారని చెప్పారు.ఇకనుంచి ప్రభుత్వ నుంచి వచ్చే నిధులు అధికార పార్టీ నాయకులే చేసుకోవచ్చుని అన్నారు.అదేవిధంగా సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు,విశ్వనాధపురం సర్పంచ్ బొలినేని నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివద్ధి పనులకు మండల పరిషత్ అధ్యక్షులు సహకరించడం లేదని,బిల్లులు పేరుతో అభివద్ధి పనులకు ఆటంకంగా మారారని అన్నారు.ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకుల షెడ్లు తోపాటు పలు అభివద్ధి పనులకు,గ్రామాల్లో సిమెంట్ రోడ్ నిర్మాణానికి,లింకు రోడ్లు పనులకు తీర్మానాలు ఇవ్వనియకుండా చేస్తున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివద్ధికి నిధులు మంజూరు చేసినప్పటికీ తీర్మానాలు ఇవ్వకపోవడం వల్ల అభివద్ధి పనుల ముందుకు సాగడం లేదని అన్నారు.బిల్లులు చెల్లింపులు పేరుతో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో చేసిన పనులపై విచారణ చేపడితే వారి అవకతవకులు బయట పడతాయని ఉద్దేశంతోనే బిల్లులు అడుగుతున్నారని అన్నారు. రెండోసారి కూడా వాయిదా పడడంతో సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధులు,

ఎంఎల్‌సి, టిడిపి నాయకుల మధ్య వాగ్వాద దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు : జనసేన, మెడికవర్ , కార్తికేయ డెంటల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక 16వ డివిజన్ పరిధిలోని గుర్రాల మడుగు సంఘం ప్రాంతంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. నగర నియోజకవర్గం పరిధిలోని 28 డివిజన్లో జనసేన పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే భాగంగా జిల్లా పర్యవేక్షకులు ఏపి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ సూచనలతో గునుకుల కిషోర్ సతీమణి విజయలక్ష్మి ఆధ్వర్యంలో 16 డివిజన్,గుర్రాల మడుగు సంఘంలో మెడికల్ క్యాంపు నిర్వహించి ఈసీజీబీపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జనసేన జిల్లా పర్యవేక్షకులు సీనియర్ నాయకులు మల్లికార్జున యాదవ్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్ రామిరెడ్డి, కార్యాలయంఇన్ చార్జ్ జమీర్,సిటీ పర్యవేక్షకులు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,వారి సతీమణి విజయలక్ష్మి, రూరల్ పర్యవేక్షకులు చంద్రశేఖర్ రెడ్డి,జనసేన నాయకులు మురళీకష్ణ, కష్ణ పెన్న జిల్లాల కోఆర్డినేటర్లు విజయలక్ష్మి,నాగరత్నం, హైమావతి,రేవతి, గజరాజు శాంతి కల,శాంభవి ,జిల్లా అధికార ప్రతినిధి కారంపూడి కష్ణారెడ్డి, డివిజన్ నాయకులు నరహరి, వెంకటరమణ, యాసిన్, అబీద్,శ్రీకాంత్, హుస్సేన్,వెంకీ, వసీం,కిషోర్ ఉన్నారు.

క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలో క్రికెట్ క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఉదయం కందుకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా నిర్వాహకులు మస్తాన్, చిరంజీవి, రియాజ్, నాగరాజు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభానికి విచ్చేసిన కందుకూరు శాసనసభ్యులు నాగేశ్వరరావుకి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎంఎల్ఎ పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్ ,గొంది నర్సింగరావు, షేక్ సలాం ,ఇతర నాయకులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలలో ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు : ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఒంగోలు లో తొలిసారి నిర్వహించిన అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ (మెన్) పోటీలలో కందుకూరు టి ఆర్ ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల విద్యార్థులు. ప్రథమ స్థానం సాధించారు. టి ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల కు చెందిన 7మంది విద్యార్థులు ఈనెల 28 నుంచి మార్చి 4 వరకు తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో జరగబోవు అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్ బాల్ పోటీలలో ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం జట్టు తరపున పాల్గొంటా రని అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కరుణ్ కుమార్ తెలిపారు. క్రీడాకారులను అభినందించారు. ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం హ్యాండ్ బాల్ జట్టుకు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కందుకూరు విద్యార్థులు జె నాగబాబు,సిహెచ్‌వి నాగేశ్వరరావు,కె వెంకట సాయి,డి యువరాజ్,టి గోపినాద్,జె సాల్మన్,వై కుమార్ ఎంపికయ్యారు.

ఉచితంగా మందులు పంపిణీ

ప్రజాశక్తి -ఉలవపాడు : సరయుస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఉలవపాడు వారి ఆధ్వర్యంలో మండల పాస్టర్స్ సభ్యుల సహాయ సహకారంతో ఆత్మకూరు గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్, డయాబెటిక్, ఎమర్జెన్సీ వైద్య నిపుణులు డాక్టరు రాజేష్. ఉప్పిరెట్ల, కాన్పులు మరియు గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ సుస్మిత. జోరపల్లి పాల్గొని రోగులను పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు.

సిఎంను కలిసిన 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ - జ్యోతిల కుమారుడు గోకుల్ రిష్వంత్ వివాహానికి ఆది వారం నెల్లూరుకు సిఎం చంద్రబాబు నాయుడు వచ్చారు. ఈ సంద ర్భంగా ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వర రావు సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

○ ఎక్సైజ్ అధికారుల కను సన్నల్లోనే వ్యవహారం
○ మాజీ మంత్రి స్వగ్రామంలోనే 24 దుకాణాలు
○అబ్కారీ శాఖ తీరుపై జనం ఆగ్రహం

ప్రజాశక్తి-కందుకూరు : ఊరురా మద్యం దుకాణాలు విచ్చలవిడిగా విస్తరిస్తుంటే ఎక్సైజ్ అధికారులు కృడా మద్యం బెల్ట్ షాపులే లేవని బుకాయించడం గమనార్హం. రహదారి పక్కన ఉండే డాబాలు, ఇతర దుకాణాలతో పాటు గ్రామాల్లో సైతం చిన్న కూల్డ్రింక్ షాపులు, చిల్లర కొట్లలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో మద్యం బెల్టు షాపులను ఉపేక్షించేది లేదని ప్రభుత్వ పెద్దలు నిత్యం హెచ్చరికలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడా మద్యం బెల్ట్ షాపులే లేవని ఎక్సైజ్ అధికారులే ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి అధికారంలో ఉన్నంతకాలం ఆయన స్వగ్రామం మాచవరం గ్రామంలో భయపడుతూ ఒకరిద్దరు మాత్రమే బెల్ట్ షాపులు నిర్వహించుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహీధర్ రెడ్డి స్వగ్రామం మాచవరంలో ప్రస్తుతం 24 మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మహీధర్ రెడ్డి కూడా అన్నింటినీ నిశితంగా గమనిస్తూ కూటమి ప్రభుత్వంపై విమర్శలకు దీనిని ఒక అస్త్రంగా ఎంచుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

లైసెన్స్ షాపుల నుంచి ఇంకా కుదరని ఒప్పందం

గతంలో లైసెన్స్ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసిన రోజు నుంచే ఎక్సైజ్ శాఖ ఇతర పోలీసులకు నెలవారీ మామూళ్ల ఒప్పందం ఉండేదని కొందరు నిర్వాహకులు చెబుతున్నారు. ఇటీవల లైసెన్స్ మద్యం షాపులు ఏర్పాటు అయిన గత అక్టోబర్ నెల నుండి కూడా కందుకూరు సర్కిల్ పరిధిలో . అటు ఎక్సైజ్ శాఖకు గానీ, ఇటు సివిల్ పోలీసులకు గానీ నెలవారీ మామూళ్ల విషయంలో ఇంకా ఎలాంటి ఒప్పందం జరగలేదని తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటు అయిన షాపుల యజమానులు ప్రభుత్వం ఇచ్చిన లాభం మార్జిన్ లోనే అన్ని రకాల పన్నులను కలపడంతో కొత్తగా వచ్చిన మద్యం షాపుల వల్ల ఎలాంటి ఆదాయం లేదని వారు గగ్గోలు పెడుతున్నారు. ఈనెల 15వ తేదీన కందుకూరులో జరిగిన సీఎం చంద్రబాబు కార్యక్రమానికి కూడా ఒక్కొక్క మద్యం దుకాణం నుండి రూ 5000 లెక్కన పోలీసులు వసూలు చేసినట్లు విమర్శలు ఉన్నాయి.

మా సంగతి తేల్చండి..

ఇటీవల గౌడ మద్యం దుకాణాల లైసెన్సుల ప్రక్రియ ముగిసినప్పటి నుండి ఎక్సైజ్, పోలీసు అధికారులు మామూళ్ల విషయంలో కొంత దూకుడు పెంచినట్లు చెబుతున్నారు. ఎస్ టి ఎఫ్, ఈ ఎస్ టి ఎఫ్, ఎన్ ఫోర్స్ మెంట్ పేరుతో మద్యం షాపుల నుండి కొంత మొత్తం వసూలు తో పాటు గతంలో మాదిరిగా లోకల్ పోలీసు స్టేషన్లకు నెలవారీ మామూళ్ల విషయం తేల్చాలని ఎక్సైజ్ పోలీసులు మద్యం షాపులు యజమానులతో సమావేశాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒక్కో దుకాణానికి వారు అడిగినంత ఇస్తే ఎలాంటి నిబంధనలు ఉండవు. అదే నిరాకరిస్తే మాత్రం ప్రభుత్వం నిర్దేశించిన సమయానికకే షాపులు తెరవాలి. దుకాణాల వద్ద లూజు విక్రయాలు జరుపరాదని సవాలక్ష ఆంక్షలు విధించి ముప్పుతుప్పులు పెడతారని మద్యం దుకాణాల యజమానులు వాపోతున్నారు.

అప్పుడప్పుడు కేసులు రాయాల్సిందే.!

మద్యం షాపుల యజమానులతో ఎంత మాట్లాడుకున్నప్పటికీ అప్పుడప్పుడు కొన్ని జరిమానా కేసులను ప్రభుత్వానికి చూపించాల్సిందే అన్నది ఎక్సైజ్ అధికారుల వాదన. ఇప్పటిదాకా జరిగిందేదో జరిగింది.. వచ్చే మార్చి నెల నుండైనా మాది మాకు ఇవ్వండి.. మీ ఇష్టం వచ్చినట్లుగా వ్యాపారం చేసుకోండి. అని ఎక్సైజ్ శాఖ, పోలీసులు మద్యం షాపు యజమానులు ముందు పెడుతున్న డిమాండ్ పై కొంత తర్జన, భర్జన నడుస్తున్నట్లు చెబుతున్నారు. గ్రామాలలో నిర్వహించే బెల్టు షాపులకు కూడా పై నుండి ఎవరైనా అది. కారులు రైడ్ కు వస్తే ఆ సమాచారం కూడా ముందుగానే చెబుతామంటూ బెల్ట్ షాపు నిర్వాహకుల నుండి కూడా ఎక్సైజ్ సిబ్బంది అందిన కాడికి దండుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

బెల్ట్ షాపులు ఎక్కడా లేవు.!

ఎక్సైజ్ సిఐ వెంకట్రావు

కందుకూరు సర్కిల్ పరిధిలో మద్యం బెల్టు షాపులు ఎక్కడా లేవని కందుకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బి వెంకట్రావు అన్నారు. కొన్నిచోట్ల బెల్టు షాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఈ నెలలోనే ఐదు కేసులు పెట్టామని చెప్పారు. బెల్ట్ షాపు నిర్వాహకుల నుండి మా సిబ్బంది ఎవరైనా వసూళ్లకు పాల్పడితే అలాంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసు కుంటామన్నారు.బెల్టు షాపులపై మా ప్రమేయం, ఇతరత్రా విమర్శలు అన్నీ కేవలం ఆరోపణలు మాత్రమే అని ఎక్సైజ్ సీఐ వెంకట్రావు కొట్టిపారేశారు.

రామాంజనేయులకు పరామర్శ

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

మండలంలోని కాకర్ల పాలెం గ్రామానికి చెందిన వెంకట రామాంజనేయులును పలువురు నాయకులు పరామర్శించారు చీరాల శాసనసభ్యులు ఎం ఎం కొండయ్య ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు ఆదివారం సాయంత్రం కాకరలపాలెంలో తన నివాసంలో వెంకట రామాంజనేయులు కుటుంబాన్ని పరామర్శించారు తమ తల్లి అయినటువంటి పేయ్యల సుబ్బమ్మఅనారోగ్యంతో మరణించారు ఈ నేపథ్యంలో సోమవారం సంస్కరణ సభ జరగనుందని ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎమ్మెల్యే వెంకట రామాంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించారు ధైర్యంగా ఉండాలని సూచించారు

పరామర్శిస్తున్న ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య

పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలు జంగిలి రోశమ్మ పట్టణంలోని మార్కెట్ సెంటర్లో పనిచేస్తుండగా 407 వాహనం ఢీకొట్టడంతో గాయపడింది. అక్కడ ఉన్న స్థానికులు ఆమెను కందు కూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ నాయకులు రోశమ్మ చికిత్స పొందుతున్న ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి పరామర్శించి వైద్యులను రోశమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోశమ్మను పరామర్శించిన వారిలో ఏఐటీయూసీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు బూసి సురేష్ బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై.ఆనందమోహన్, ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రవణమ్మ, నాయకులు పులి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ ఫంక్షన్ ప్రధానోపాధ్యాయులు డి.బాలబ్రహ్మం అధ్యక్షతన ఆదివారం జరిగినది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త కే.రమణారెడ్డి, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.నరసింహారావు, ఎమ్.వి. జానకి రామ్, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్లు బి.అజయ్ బాబు, కె.వి సుబ్బారెడ్డి, ప్రతిభా విద్యాసంస్థల డైరెక్టర్ నల్లూరి జయప్రకాష్ నారాయణ, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.రామారావు, నక్షత్ర కాలేజీ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు పలువురు వక్తలు మాట్లాడుతూ నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు ఉన్నతమైన ప్రమాణాలతో విద్య అందిస్తుందన్నారు. విద్యతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్షల్లో కష్టపడి చదివి మంచి ప్రతిభను చూపించి విద్య బోధించిన స్కూల్ యాజమాన్యానికి ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసు కురావాలని ఆకాంక్షించారు. గత సంవత్సరం పదిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కె.రమణారెడ్డి కూడా మంచి మార్కులు సాధించిన పై ఇద్దరి విద్యార్థులకు చెరి పదివేల రూపాయలు క్యాష్ అవార్డును అందించారు. ఎన్. జైప్రకాష్ నారాయణ స్వామి వివేకానంద బోధనలతో కూడిన పుస్తకములను విద్యార్థిని విద్యార్థులకు అందించారు. మర్రెడ్డి, కే శ్రీనివాసరావు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, సిబ్బంది,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాఠశాల కరస్పాండెంట్ షాలిని రెడ్డి

పుస్తక పఠనంపై అవగాహన

ప్రజాశక్తి - ఉలవపాడు : చదవటం 'మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయం లో ఆదివారం విద్యార్థులకు హెూంవర్క్ లో భాగంగా గ్రంథాలయలో నచ్చిన జాతీయ నాయకుల జీవిత చరిత్ర చదివి రాయడం జరిగిందని గ్రంథ పాలకడు డి. కోటేశ్వరరావు తెలిపారు.ప్రతి ఆదివారం రోజున గ్రంథాలయనికి విద్యార్థులు తప్పనిసరిగా వెళ్లి నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్ర, ఏదో ఒక అంశంపై వ్యాసం రాసి గంధపాలకు అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు : మండలం పెద్ద ఓగూరు గ్రామ వాస్తవ్యులు చల్లా మాధవ రావు కుమారుడు అవినాష్ - సాయి శివానిల వివాహం పట్ట ణంలోని ఆలా వారి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. వివాహానికి హాజరై వధూవరులను ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావు ఆశీర్వాదించారు.
అలా వారి కళ్యాణ మండపం లో కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన చల్లా మాధవరావు కుమారుడు అవినాష్, సాయి శివాని ల వివాహం కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు.టిడిపి నాయకులు చల్లా శ్రీనివాసరావు,దామా మలేశ్వరరావు, వున్నం భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా 'రంజాన్‌కు స్వాగతం'

ప్రజాశక్తి-ఉదయగిరి

జమాతే ఇస్లామీ హింద్ ఉదయగిరి శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో రంజాన్‌కు స్వాగతం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం దిలావర్ బావి వీధి మదరసాలో నిర్వహించి జమాతే ఇస్లామి హింద్ మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఫాతిమా కౌసర్ హుమైరవి, జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం జిల్లా బాధ్యురాలు ఫాతిమా మహమ్మద్ ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడారు. రంజాన్ మాసం శుభాల మాసమని, పుణ్యాల మాసమని, దయాదాక్షిణ్యాలు అలవర్చుకొనే మాసమని, ఆర్థిక స్థోమత కలిగిన వారు పేదలకు అనాథలకు అవసరార్థులకు జకాత్ చెల్లించే మాసమని, చెడు ప్రవర్తనను విడనాడి మంచి ప్రవర్తన అలవర్చుకునే శిక్షణ ఇచ్చే మాసమని, భౌతికంగా మానసికంగా ఆరోగ్యవంతులుగా తయారు చేసే నెలగా, సర్వ మానవాళికి మార్గదర్శకత్వం చూపిస్తూ పరిశుద్ధ జీవితం ఎలా గడపాలో తెలిపే దైవగ్రంథమైన ఖురాన్ అవతరించిన నెల అని అన్నారు. కాబట్టి మనమందరం ఈ నెలను ఒక అవకాశంగా, ఒక శిక్షణా కాలంగా, మన ప్రవర్తనను మార్చుకునే ఒక సువర్ణ అవకాశంగా, ప్రపంచంలోని మానవులందరూ ఒకే తల్లి తండ్రి సంతానంగా సౌభ్రాతృత్వం- సోదర భావం కోసం పాటుపడాలని, మనలో ఉన్న ఈర్ష్య, ద్వేషం, అసూయ, చెడు నైతికత, చెడు ప్రవర్తన, గర్వం, అహంకారం, దౌర్జన్యం, అతివాదం, మూర్ఖత్వం, ఎదుటివారిని కించపరచటం, ఎదుటివారి మనసును గాయపరచటం, ఇతరుల హక్కులకు భంగం కలిగించడం వంటి భావనల నుంచి బయటకు వచ్చి పరిశుద్ధమైన జీవితాన్ని అలవర్చుకోవడానికి ఈ రంజాన్ మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పరిసర ప్రాంతాల ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

'ఠాగూర్' స్కూల్లో యాన్యువల్ డే

ప్రనజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని ఠాగూర్ స్కూల్లో యాన్యువల్ డే సెలబ్రేషన్స్ ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సిహెచ్ రమణారెడ్డి, దొరస్వామి రెడ్డి మాట్లాడుతూ గత 30యేళ్ల నుండి ఎఎస్‌పేట మండలంలో ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అనే పేరుతో స్కూల్ నడుపుతున్నామని, తమ స్కూల్లో ఎంతోమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు గాను, విదేశాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలోనూ ఉత్తమ ప్రతిభలు కనబరుస్తూ ఉన్నారని, క్రమశిక్షణకు మారుపేరు తమ పాఠశాల అని అదేవిధంగా మండలంలోని ఉండే ఏకైక ప్రయివేట్ పాఠశాల తమదేనని తెలియజేశారు. ఈ యాన్యువల్ డే సెలబ్రేషన్స్‌లో పిల్లలు చేసిన నృత్యాలు చాలా చాలా ఆహ్లాదకరంగా ఉన్నాయి. కార్యక్రమంలో ఆత్మకూరు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి, అపస్మా స్టేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, ఎస్ఐ ఎ.సైదులు, ఎంఇఒలు ఎం.జ్యోతి, సాయిప్రసాద్, ఎంపిపి కేత వేణుగోపాల్, ఠాగూర్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఠాగూర్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలం గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ఎపిపిఎస్‌సి గ్రూప్-2 మెయిన్ పరీక్షలు యథావిధిగా ఆదివారం ప్రశాంతంగా కొనసాగాయి. కొన్ని రోజులుగా ఈ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ ఎపిపిఎస్‌సి సెక్రటరీకి ప్రభుత్వం లేఖ రాసింది. ఈ నేపథ్యంలో పరీక్షలు యథావిధిగా నిర్వహించాలని సింగిల్ జడ్జ్ ధర్మాసనం కూడా మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొత్తం ఈ పరీక్షకు వెయ్యి మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 895 మంది హాజరై 105 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఈ గ్రూప్-2 మెయిన్ పరీక్షకు సిఐ వి.సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ రంగనాథ్ గౌడ్, సిబ్బంది పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్షా హాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకుండా పోలీసులు నిశిత పరిశీలన చేపట్టి పరీక్ష కేంద్రంలోకి అనుమతింపజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-కావలి : సమాజంలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సమాజంలో వాయు కాలుష్యం, ధ్వని కాలుష్యం, జల కాలుష్యం పెరిగి ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం దెబ్బ తింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పౌర సమాజం అడవులను కాపాడుకొని, విరివిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షించుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయింది. ఎవరు వీధుల్లో కూడా మొక్కలు నాటడం లేదని, తద్వారా కార్బన్‌డయాక్సైడ్ పెరిగి ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. స్వచ్ఛమైన గాలి పీల్చుకొని ఆరోగ్యంగా జీవించడం కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను నియంత్రించి ప్లాస్టిక్‌ను వినియోగం నివారించి, గుడ్డసంచులు వాడాలని, విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తే ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించవచ్చునని, దూరంగా జీవించవచ్చని తెలిపారు. దాని కోసం పౌర సంఘాలు, అధికారులు నిరంతరం ప్రజలలో అవగాహన కల్పించాలని, పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని తెలియజేశారు.

పలు కార్యక్రమాలకు ఎంఎల్‌ఎ క్రిష్ణారెడ్డి హాజరు

ప్రజాశక్తి-కావలి : వవ్వేటి సుబ్బయ్య - రజని కుమార్తె శిరీష వివాహం ఆదివారం కావలి పట్టణంలోని బందారపు కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కావలి రూరల్ మండలం చెంచుగానిపాలెం గ్రామానికి చెందిన జ్యోతి మస్తానయ్య - సుజాత కుమార్తె దీపిక వివాహం, ఇటీవల జరిగిన, చెంచుగానిపాలెం గ్రామానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కావలి మండల ఉద్యోగుల సంఘం సభ్యులు, చెన్నై కొండలరావు - మాధవి కుమార్తె వివాహం కావలి మండలంలో జరిగింది. కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రాసం కొరతతో అల్లాడుతున్న మూగజీవాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఉదయగిరి నియోజకవర్గం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే ప్రాంతం. అయిదారేళ్లకు.. ఒకసారి సగటు వర్షపాతం నమోదు అవుతూ ఉంటుంది. వ్యవసాయం సాగయోగ్యమైనా కేవలం పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవించే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. బతుకుదెరువు కోసం బయట ప్రాంతాలకు వెళ్లి జీవించే కుటుంబాలు అనేకం ఉన్నప్పటికీ పెట్టుబడులు పెట్టి బయట ప్రాంతాలకు వెళ్లి మనుగడ సాగించలేని మరెన్నో కుటుంబాలు తమకు ఉన్న కొద్దిపాటి భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తూ ఉంటారు. భూమిలేని అనేక కుటుంబాలు పశుపోషణపై తమ కుటుంబాలను నెట్టుకొస్తూ ఉన్నాయి. గత ఏడాది పోలిస్తే ఈ ఏడాది సగటు వర్షం కూడా ఉదయగిరి నియోజకవర్గంలో నమోదు కాకపోవడంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడింది. గొర్రెల కాపరులు ఇప్పటికే పశ్చిమ ప్రాంతాలకు తమ గొర్రెలను తీసుకొని ప్రయాణం సాగిస్తున్నారు. ఆవులు గేదెలను పోషించుకొని కుటుంబాన్ని పోషించుకునే వాళ్లు మాత్రం ఇప్పటికీ గ్రాసం కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఉదయగిరి ప్రాంతానికి చెందిన పాడి రైతులు ఈ ప్రాంతం నుంచి పాలను సేకరించి వ్యాపారం సాగిస్తూ ఉంటారు. ప్రభుత్వం ఈ ప్రాంతానికి మార్కెట్ యార్డు ద్వారా సబ్సిడీతో గడ్డి పంపిణీ చేస్తూ ఉంటుంది. గతం నుంచి కూడా ప్రభుత్వం ఈ పాలసీని అవలంభిస్తూ వస్తోంది. అదేవిధంగా ఈ యేడాది కూడా డెల్టా ప్రాంతంలో గడ్డి కొనుగోలు చేసి మెట్ట ప్రాంతమైన ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారాంపురం మండలాలకు గడ్డి సరఫరా చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఈ ప్రాంతాలకు గ్రాసానికి ఇబ్బంది పడే పరిస్థితుల్లో మూగజీవాలకు నీరు, గడ్డి దొరకడం అంత సాధ్యమైన విషయం కాదు. అడవుల్లో ఉన్న పచ్చిక కోసం గ్రామ పొలిమేరల ప్రయాణం కడుతుంది. అలాంటి పరిస్థితుల్లో మూగజీవాలకు గ్రాసం దొరకడం గగనంతో కూడుకున్న పని. పాడి రైతులు పడుతున్న ఈ కష్టాలను ప్రభుత్వం గుర్తించి వెంటనే వ్యవసాయ మార్కెట్ ఆఫ్ ద్వారా డెల్టా ప్రాంతం నుంచి గడ్డి కొనుగోలు చేసి మెట్ట ప్రాంత రైతులకు అందజేయాలని ఈ ప్రాంత పాడి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమిష్టి కృషితో టీకాలను అందిస్తాం..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వ సూచనల మేరకు సమిష్టి కృషితో ప్రజలందరికీ టీకాలను అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్రంలోని అన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలకు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటుందో ఆమె మాటల్లోనే..

ప్రశ్న. జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకొనేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేస్తున్నారు... ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు ఏమైనా నిర్వహించారా..?

జవాబు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు సమిష్టి కృషి చేస్తున్నాం. అందులో భాగంగా ఇటీవల జిల్లా పరిధిలోని ప్రాథమిక, అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్ స్టాఫ్, అర్బన్ పరిధిలోని కమ్యూనిటీ ఆర్గనైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాం. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, సెప్టెంబర్ నెలలో హెడ్‌కౌంట్ సర్వే నిర్వహించడం జరుగుతుందని, సర్వే ముఖ్య ఉద్దేశం గర్భిణులు, 0-2 సంవత్సరాల పిల్లలు 0-5 సంవత్సరాల పిల్లలను గుర్తించి, వారికి ఇవ్వాల్సిన వ్యాధినిరోధక టీకాలు కోసం ప్రణాళిక తయారు చేసి, ఆ ప్రణాళిక ప్రకారం వారికి టీకాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తల ద్వారా హెడ్‌కౌంట్ సర్వే నిర్వహించి, ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచనలు చేశాం. ప్రాథమిక కేంద్రాల పరిధిలోని మండల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం ఫిబ్రవరి 10వ తేదీ లోపు పూర్తి చేయాలి. హెడ్ కౌంట్ సర్వే రిజిస్ట్రేషన్ యువిన్ యాప్‌లో ఫిబ్రవరి 28వ తేదీ లోపు అప్లోడ్ చేయాలి. సచివాలయం పరిధిలో మైక్రో యాక్షన్ ప్లాన్ మార్చి 5 లోపు తయారు చేసుకోవాలి. ప్రాథమిక, అర్బన్ ఆరోగ్య కేంద్రాల వారు మార్చి 10వ తేదీ లోపు మైక్రో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలి. ప్రాథమిక అర్బన్ ఆరోగ్యం వారు తయారు చేసిన మైక్రో యాక్షన్ ప్లాన్ మార్చి 15వ తేదీ కల్లా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి వారి కార్యాలయానికి పంపించాలి. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి వారి కార్యాలయం నుండి మార్చి 20వ తేదీ కల్లా రాష్ట్ర వ్యాధి నిరోధక టీకాల అధికారి వారి కార్యాలయానికి పంపించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న. జిల్లాలో ఎన్‌సిడి-సిడి 3.0 స్క్రీనింగ్ కార్యక్రమాలపై ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లాలో ఎన్ని బృందాలు పనిచేస్తున్నాయి..?

జవాబు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌సిడి-సిడి 3.0 స్క్రీనింగ్ కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు లక్ష్యాలను నిర్ణయించింది. ఈ లక్ష్యాలను అధిగమించేందుకు ఇటీవల యుపిహెచ్‌సి వైద్యాధికారులతో, ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించాం. పట్టణ ప్రాంతములో ఎన్‌సిడి - సిడి 3.0 స్క్రీనింగ్ లక్ష్యాన్ని త్వరితగతిన సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నాం. ఇప్పుడున్న 167 స్క్రీనింగ్ టీమ్లను 334 కి పెంచడమైనదని, ప్రతి టీమ్ కి ఇద్దరు చొప్పున ఎఎన్ఎం/ ఆశా / హెల్త్ సూపర్‌వైజర్లతో పాటు నర్సింగ్ స్టూడెంట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశాం. ప్రతి టీమ్ ప్రతిరోజు 5 నుంచి 7 ఇండ్లు తగ్గకుండా సర్వే చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేయడం, స్క్రీనింగ్‌లో పురోగతి లేని ఎడల కఠిన చర్యలు తప్పవని యుపిహెచ్‌సి వైద్యాధికారులకు, సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశాం.

ప్రశ్న. ఇటీవల కాలంలో జిల్లాలో వైరల్ ఫీవర్ల కేసులు ఎక్కువగా నమోదు అవుతు న్నాయి. ముఖ్యంగా డెంగీ, చికున్‌గున్యా, తదితర వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రులకు వెళు _న్న వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ఫీవర్ల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు. జిల్లాలో వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న వారి వివరాలు తెలుసుకోని, వారి కుటుంబంలో మిగిలిన వారి నుంచి, ఆయా ఇంటి చుట్టుపక్కల ఉన్న ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి ఈ జ్వరాలు తీవ్రత తగ్గించేందుకు జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో పలు చర్యలు తీసుకున్నాం. ఇటీవల జిల్లాలోని సబ్ యూనిట్ ఆఫీసర్లకు జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో మాసాంతపు సమీక్ష సమావేశం నిర్వహించాం. ఈ సమావేశంలో డెంగీ, చికున్‌గున్యా, మలేరియా పాజిటివ్ కేసులు వచ్చిన ప్రాంతాల్లో తీసుకోవాల్సిన నివారణ చర్యలు గురించి అవగాహన కలగజేసే కార్యక్రమాలు చేపట్టాం. అదేవిధంగా కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దృష్టి సారించాలని ప్రజలకు సూచనలు చేశాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కేసులు నమోదు నమోదవుతున్న దృష్ట్యా క్వాలిటీగా చర్యలు తీసుకొని కొత్త కేసులు నమోదు కాకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందికి సూచనలు చేశాం. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే జరుగు సమయంలో మానిటరింగ్ చేసి ఆరోగ్య కార్యకర్తలకు ఆశా కార్యకర్తలకు తగు సూచనలు సలహాలు అందజేయాలని అధికారులకు సూచనలు చేశాం. ఇంటి పరిసరాలలో అనవసరపు నీటి నిలువలను లేకుండా చూసుకొని దోమల పెరుగుదల జరగకుండా చూడాలని, రాత్రిపూట నిద్రించేటప్పుడు దోమతెరలు వాడాలని స్థోమత ఉన్నవారు ఇంటిని మస్కిటో స్క్రీనింగ్ చేయించుకొని కీటక జనిత వ్యాధులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహించాం.

బస్ షెల్టర్ లేక చెట్లకింద ఉన్న ప్రయాణికులు

బస్ షెల్టర్లు లేక అవస్థలు..

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే ఎండాకాలాన్ని తలిపించే ఎండలతో మాడిపోతున్న ప్రయాణీకులకు అవసరమైన ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో బస్సుల కోసం ఎండలో నిలిచి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెల్లూరు - ముంబై హైవే రోడ్డు నిర్మాణం జరిగే క్రమంలో బస్‌షెల్టర్లు నిర్మించారు. కానీ ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. ఎందుకంటే బస్సు ఆగేచోటకు కిలోమీటర్ దూరంలో బస్సు షెల్టర్లు నిర్మించారు. దానివల్ల ఉపయోగకరంగా లేకపోవడంతో పట్టణంలోకి వచ్చే ప్రయాణీకుల కోసం ఉన్న బస్ షెల్టర్లు పట్టణం నుంచి బయటకు వెళ్లే ప్రయాణీకులకు లేకపోవడం ఆత్మకూరు మున్సిపాలిటిలో ప్రత్యేకం. ఆత్మకూరు పట్టణంలోని నెల్లూరుపాళెం సెంటర్ నెల్లూరు - ముంబాయి హైవే. నెల్లూరు నుండి కడపకు, ఆత్మకూరు నుండి వింజమూరు తదితర గ్రామాలకు నాలుగు రోడ్ల కూడలిగా ఉంది. ఇక్కడ బస్సు ఎక్కేందుకు నిత్యం ఎక్కవ మంది ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. అయితే ఈ ప్రాంతంలో ఒక్క బస్ షెల్టర్ కూడా ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా లేదు. అయితే నెల్లూరు నుంచి ఆత్మకూరుకు వచ్చే మార్గంలో ఉన్న బస్ షెల్టర్ ఉంది. బస్సు దిగే ప్రయాణీకులకు మాత్రమే అది ఉపయోగ పడేలా ఉంటుంది. అదే పరిస్థితి పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు రోజు అనేక ప్రాంతాల నుండి సుమారు 500మంది వైద్యం కోసం నిత్యం వస్తూ ఉంటారు. వైద్యశాలకు వచ్చే ప్రయాణీకుల కోసం ఒక సైడు బస్‌షెల్టర్ ఉంది కానీ అక్కడనుండి వారు గమ్య స్థానానికి వెళ్లే ప్రయాణికులకు మాత్రం బస్ షెల్టర్ లేదు. దాంతో ఎండల్లో నిత్యం మాడుతూ ప్రజలు బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. అలాగే మండలంలోని నువ్వురుపాడు ఎస్సీ కాలనీ వద్ద బస్ షెల్టర్ లేదు. అక్కడ స్థానికులు బస్ సెంటర్ లేక చెట్ల వద్ద తల దాచుకుంటున్నారు.

పాఠశాలకు కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి-కావలి

స్థానిక వెంగళరావు నగర్ శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కూర్చునేందుకు కుర్చీల కొరత ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్ కోరిక మేరకు శ్రీ శ్రీనివాస కళాశాల యాజమాన్యం రూ.5వేలు విలువ చేసే 7 కుర్చీలను పాఠశాలకు బహుకరణ చేశారు. కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల బాధ్యులు ఎస్.రూపేష్, కరస్పాండెంట్ బి.అశోక్, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ వి.కల్లయ్య, 18వ వార్డు ఇన్‌ఛార్జి శానం హరి పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కుర్చీలు బహుకరించిన శ్రీ శ్రీనివాసా జూనియర్ కళాశాల యాజమాన్యానికి ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని కోరుతూ ధన్యవాదాలు తెలియజేశారు.

100శాతం ఫలితాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని ఇనమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్చిలో జరగనున్న పదవ తరగతి పరీక్షలపై నూరుశాతం ఫలితాల సాధనే విద్యేయంగా ప్రత్యేక దృష్టి సారించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధారాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం తమ పాఠశాల నుంచి రానున్న పదవ తరగతి పరీక్షలకు 51 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. ప్రస్తుతానికి 49మంది మాత్రమే హాజరవుతున్నారని, ఇద్దరు విద్యార్థులు కంటిన్యూగా గైర్హాజరవుతున్నారన్నారు. ఇప్పటికే పది విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రేడ్లుగా విభజించి సి, డి గ్రూపులో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ప్రతి రోజూ సాయంత్రం నాలుగు మంగల నుంచి ఐదు గంటల వరకు పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకుగానూ తమ ఉపాధ్యాయులు, తాము ప్రత్యేకంగా నిధులు సమకూర్చుకుని ప్రతి రోజూ సాయంత్రం వేళ విద్యార్థులకు ఏదొక రకమైన పౌష్టికాహారాన్ని అందిస్తూనే ఉన్నామన్నారు. తమ సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా మంచి ఫలితాల సాధనే ధ్యేయంగా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేట గ్రామంలోని ఎపి ఆదర్శ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి గాను, 6వ తరగతి ప్రవేశాలకు, 24వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.శ్రీదీపు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు చెల్లింపునకు మార్చి 31వ తేదీ వరకు గడువు విధించామని తెలిపారు. ఒసి, బిసిలు రూ.150, ఎస్‌సి ఎస్‌టి కుటుంబాల చెందినవారు రూ.75 చెల్లించి అర్జీలు సమర్పించాలని, పేర్కొన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ఎఎస్‌పేటలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. మరిన్ని వివరాల కోసం 9347111388, 8247539776 నెంబర్లకు సంప్రదించి రావాలని తెలిపారు.

లారీ తగలడంతో పగిలిన బస్సు అద్దాలు

బజార్ సెంటర్లో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోల్ బజార్ సెంటర్లో దక్షిణం రైల్వే గేటు వద్ద శనివారం రాత్రి సుమారు 20 నిమిషాల పాటు ట్రాఫిక్ స్తంభించింది. రైల్వే గేటుకు పడమర వైపు సుమారు బోగోలు మండలం సంబంధించిన పది పంచాయతీ గ్రామాలు ఉండగా నిత్యం వందల లారీలు వాహనాలు తిరుగుతా ఉంటాయి. బోగోలు బజార్ సెంటర్లో ఇష్టానుసారంగా బండ్లు పార్కు చేసి ఉండడంతో ట్రాక్టర్లు, లారీలు, బస్సులు ద్విచక్ర వాహనాలు దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్‌టిసి బస్సు వెనక్కు పోవడంతో లారీ తగిలి బస్సు అద్దాలు పగిలిపోయాయి. ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. బోగోలు బజార్ సెంటర్ ఇబ్రహీంపేట బజార్ సెంటర్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ నియంత్రించవచ్చని, బోగోలు మండల ప్రజలకు కోరుతున్నారు.

కండక్టర్‌ల కుటుంబాలకు చేయూత

ప్రజాశక్తి-కావలి

కావలి డిపో కండక్టర్స్ ఫ్రంట్ లైన్ గ్రూప్ తరపున గ్రూపు సభ్యులందరూ కలసి రూ.80వేలను కండక్టర్లుగా పనిచేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న ధనలక్ష్మికి, ఒంగోలు హరికృష్ణకి వారివారి స్వగృహాల దగ్గరకు వెళ్లి, కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్‌ల చేతుల మీదుగా వారి సహాయార్థం సేకరించిన సొమ్మును బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కండక్టర్స్ గ్రూప్ ఫ్రంట్‌లైన్ సభ్యులు ఎస్.డి.వై.గని, కె.హరిప్రసాద్, ఎస్.కె.కాలేషా, పులిసెట్టి శ్రీనివాసులు, డి.గోపి, ఎ.సి.వి.కుమార్, కందుకూరు డిపో కండక్టర్. కె. యన్. రావు, రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్ హైదరాబాద్ ఎల్‌డి.ఎస్ కంట్రోలర్ పి.అనిల్ పాల్గొన్నారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ కావలి డిపో కండక్టర్లు తమ సోదర కండక్టర్ల కోసం ఇలాంటి కార్యక్రమాన్ని తలపెట్టడం రాష్ట్రంలోనే ప్రథమం అని వారి ఔన్నత్యాన్ని కొనియాడారు. అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ ఈ గ్రూపు సభ్యులు తలపెట్టే ఎలాంటి కార్యక్రమాలకైనా ట్రాఫిక్ ఇన్‌ఛార్జిగా తన సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తానని తెలియజేశారు. కావలి డిపో ఎస్.టి.ఐ. మాట్లాడుతూ ఈ మహత్తరమైన కార్యానికి తనవంతు కూడా ఆర్థిక సహాయం అందజేస్తానని తెలియజేశారు. జోనల్ ట్రైనింగ్ కాలేజ్ ఎ.ఎం.టి. మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఉద్యోగులందరికీ స్ఫూర్తిదాయకమని, ఒక భరోసాని ఇచ్చే కార్యక్రమం అని కొనియాడారు. భవిష్యత్తులో మీరు చేపట్టబోయే అన్ని కార్యక్రమాలకి డిపోమేనేజర్‌గా అసిస్టెంట్ మేనేజర్‌గా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు ముందుముందు ఇంకా చాలా చేసేదానికి ఆ భగవంతుడు తమపై అధికారులు మరీ ముఖ్యంగా తమ గ్రూపులో సభ్యులు తమకు చేయూత బలాన్ని అందించాలని విన్నవించుకుంటూ సాధారణ కండక్టర్లుగా ఆర్థికపరిస్థితులు అంతంత మాత్రమే ఉన్నప్పటికీ తమతమ శక్తికి మించి ఒక్కొక్కరు రూ.5వేలు సహాయసహకారాలు అందించిన ప్రమీలకు రాజేంద్రప్రసాద్ 2004కి రిటైర్ అయి రెడ్‌క్రాస్ ఎఒగా ఉన్న బిఎస్ ప్రసాద్‌కు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు.

ఆర్థికసాయం చేస్తున్న ఫ్రంట్‌లైన్ సభ్యులు

ప్రమాదకరంగా వంతెనలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని పలు గ్రామాల పరిధిలోని ప్రధాన కాలువలపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరి దెబ్బతిన్నాయి. ఈ వంతెనలపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగుతుంటాయి. శిథిలమైన ఈ వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోవడంతో ఆయా ప్రాంతాల స్థానికులు తాత్కాలికంగా ఇనుప కమ్ములు, కర్రలు అడ్డుపెట్టి ప్రమాదాల జరగకుండా చేస్తున్నారు. మండలంలోని దామరమడుగు పాటూరు గ్రామాల మధ్య ఉన్న వంతెన, ముంబై జాతీయ రహదారి నుంచి కాలయకాగోలు గ్రామానికి వెళ్లే దారిలోని కాలువ పై ఉన్న వంతెన, సాల్మన్‌పురం, పెనుబల్లి గ్రామాల మధ్య ఉన్న వంతెన తోపాటు, బుచ్చి పట్టణం చెన్నూరు రోడ్డులోని రేబాల కాలువ, మళిదేవి కాలువలపై ఉన్న వంతెనలన్నీ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ వంతెనల కింద భాగంలో సిమెంట్ పెచ్చులు ఊడిపోయి నిర్మాణ సమయంలో ఉపయోగించిన కమ్ములు తుప్పు పడిపోయాయి. కాలం చెల్లిన ఈ వంతెనలపై నిత్యం ట్రాక్టర్లు, లారీలు వంటి భారీ వాహనాలతో పాటు,ఆటోలు, పాఠశాలల బస్సులు, ద్విచక్ర వాహనాలపై విద్యార్థులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు, కనీసం ఈ వంతెనల వద్ద ప్రమాద సూచికల సైతం లేకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10నెలలు కావస్తున్న ఈ వంతెనల నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సదరన్ ఛానల్‌పై పాతమినగల్లు గ్రామం వద్ద ఉన్న వంతెన గత ప్రభుత్వ హయాంలో తిరిగిన ఇసుక, గ్రావెల్ లారీల కారణంగా వంతెన కూలిపోయింది. అప్పటి నాయకులు, ఇసుక కాంట్రాక్టర్లు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి పబ్బం గడుపుకున్నారు. త్వరలో వరికోతలు ప్రారంభం కానున్న సందర్భంగా ఈ వంతెనలపై వడ్ల లారీలు, ట్రాక్టర్లు తిరగాల్సి రావడంతో రైతుల సైతం ఆందోళన చెందుతున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఈ వంతెనను పునర్నిస్తామని హామీ ఇచ్చి భారీమెజార్టీతో గెలుపొందిన ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డి సైతం ఇంతవరకు వీటిపై దృష్టి సారించలేదని, ఇకనైనా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకొని ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదభరితంగా ఉన్న వంతెన

'ఉదయగిరి' సమగ్రాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-వింజమూరు

ఉదయగిరి సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా మనందరం పనిచేయాలని ఉదయగిరి మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వింజమూరులోని టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అంచలంచెలుగా నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన కొనసాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో టిడిపి తరపున ఉదయగిరి నియోజకవర్గంలో పోటీ చేసిన ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌ను ఈ ప్రాంత ప్రజలు అక్కున చేర్చుకొని అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. ప్రజాసేవ కోసం ఐశ్వర్యాలను వదులుకొని కోట్లాది రూపాయలు వెచ్చించి, శ్రీ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వినూత్నంగా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టి మెట్టప్రాంత ప్రజలకు దగ్గరయ్యారన్నారు. అదే సంకల్పంతో ఉదయగిరిని అన్ని రంగాలుగా అభివృద్ధి చేసేందుకు ముందుకెళ్తున్న ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌పై నిరాధారమైన ఆరోపణలు చేయడం హేయమైన చర్య అన్నారు. ఆరోపణను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మధ్యకాలంలో కొన్ని పత్రికలు, ఛానల్స్, యూట్యూబ్‌లో, నిర్ధారణ లేని వార్తలను ప్రచురిస్తున్నారని తెలిపారు. ఉదయగిరి వాసులుగా ఈ ప్రాంత అభివృద్ధిని కోరుకోవాలే గాని, అడ్డంకులు సృష్టించకూడదన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా మీడియా పని చేయాలన్నారు. ప్రతిపక్ష నాయకులకు కూడా వీటిని చూసి ఆరోపణలు చేస్తున్నారని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మీడియా ప్రతినిధులు కూడా నాయకులతో కాకుండా నేరుగా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. ఇక్కడ కష్టాలు అనుభవించి అభివృద్ధి చెందిన దేశమైన అమెరికాకి వెళ్లి, అక్కడ స్థిరపడి, భరతమాత బిడ్డగా పుణ్యభూమి ఋణం తీర్చుకునేందుకు ఇక్కడికి వచ్చిన ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌పై ఆరోపణలు చేస్తే ఇకపై సహించమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కొద్దిమంది నాయకులకు, చిన్నచిన్న మనస్పర్థలు ఉండటం సహజమని, కుటుంబ కలహాలను, గడప దాటకముందే పరిష్కరించుకోవాలని, రోడ్డున పడితే పక్కన వారికి అవకాశం ఇచ్చినట్లు అని తెలుసుకోవాలన్నారు. అందరం సమిష్టిగా కృషిచేసి ఉదయగిరిని అన్ని రంగాలుగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, మండల కార్యదర్శి చల్లా శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి, గణపం సుదర్శన్ రెడ్డి, జూపల్లి రాజారావు, మంచాల శ్రీనివాసులు నాయుడు, జనసేన మండల అధ్యక్షులు బండారు సత్యనారాయణ, చెరువు ప్రెసిడెంట్ యల్లాల శ్రీనివాసులు తదితరులున్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ కంభం విజయరామిరెడ్డి

పొగాకు బ్యారెన్ దగ్ధం

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని నందవరంలో పొగాకు బ్యారెన్ అగ్నికి ఆహుతి అయింది. రైతు నాగిరెడ్డి బాలయ్యకు చెందిన బ్యారెన్‌లో పొగాకు అల్లిన కర్రను క్యూరింగ్ కోసం ఉంచారు. క్యూరింగ్ సమయంలో ప్రమాదవశాత్తు ఆకులు రాలి గొట్టాలపై పడడంతో మంటలు వ్యాపించి బ్యారెన్లలో ఉన్న పొగాకు మొత్తం అగ్నికి ఆహుతయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.5లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No. 792 of 2023, O.S. No. 367 of 2023

Tatiparthi Murali ...పిటీషనర్ /వాది

Vs.

Purini Kishtaiah ...రెస్పాండెంట్/ప్రతివాది

To,
Purini Kishtaiah, Son of late Venkaiah,
Pidurupalem village, Manubolu Mandal,
SPSR Nellore District.

పై నెంబరులోని పిటీషనర్ / వాది తనకు ప్రోమిస్సోరీ నోట్ బాకీ వసూలుకు గాను దావా దాఖలు చేసి మీ ఆస్తిని జప్తు చేయుటకు పై పిటీషన్ను దాఖలు చేయగా రెస్పాండెంట్ / ప్రతివాది అయిన మీకు నోటీసుకు గాను తేది 18-03-2025న వాయిదా వేసియున్నారు. కావున పై పిటీషన విషయమై రెస్పాండెంట్ /ప్రతివాది అయిన మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు ఎదుట పై తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు వ్యక్తిగతముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలియచేయవలెను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.

ఇట్లు,
Y. అరవింద్, M.B.A, LL.B.,
వాది తరపున న్యాయవాది,
గూడూరు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 367 of 2023

Tatiparthi Murali ...వాది

Vs.

Purini Kishtaiah ...ప్రతివాది

To,
Purini Kishtaiah, Son of late Venkaiah,
Pidurupalem village, Manubolu Mandal,
SPSR Nellore District.

పై నెంబరులోని వాది తనకు ప్రోమిస్సోరీ నోట్ బాకీ వసూలుకు గాను దావా దాఖలు చేసినందున ప్రతివాది అయిన మీకు నోటీసుకు గాను తేది 18-03-2025న వాయిదా వేసియున్నారు. కావున పై దావా విషయమై ప్రతివాది అయిన మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట పై తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు వ్యక్తిగతముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలియచేయవలెను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.

ఇట్లు,
Y. అరవింద్, M.B.A, LL.B.,
వాది తరపున న్యాయవాది,
గూడూరు.